# ఫొటో

టేకుమళ్ల కామేశ్వరరావు

మా పినతండ్రి నాలాగ గాక అన్ని కళలూ కొస్తో కూస్తో ఎరిగినవాడు. లలితకళలలో సున్నితమైన సౌందర్యం ఎరిగికూడా ఆయన కవిత్వం చెప్పలేదు, బొమ్మలు గీయలేదు, సంగీతంమట్టుకు రవ్వంత కూనిరాగాలు తీసేవాడు. నాకు కావలసిందీ ఇలాంటిమనిషే. తనుకూడా ఏకవిత్వమో చెప్పేమాటుంటే నాఖండకావ్యాల్ని ఇప్పటంతగా మెచ్చుకుని ఉండడేమో! నాకోసం అతను అలాగ ఉండవలసిందే అని నాకోరిక. స్వార్థం అటుంచి ఆయన ఏకళా పూర్తిగా పరిశ్రమ చెయ్యకపోడానికి కారణం ఇలాగనికూడా అనిపిస్తూంటుంది. అందరిమోస్తరుగానే మా పినతండ్రి అన్నీ తలోకాస్తా నేర్చుకున్నాడు. తాళాలు బాగుచేస్తాడు. ఇంటితలుపులకీ, ద్వారబంధాలకీ చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తాడు. స్వంతక్షౌరం చేసుకోగలడు. గుడ్డలు కాస్త ఇస్త్రీ చేస్తాడు. మా సైకిలుకి చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తూంటాడు. నాచేతి గడియారానికి ఆయిల్ చెయ్యడానికి ఆయనకే ఇస్తూన్నందువల్ల ప్రతిమాటుకి రూపాయి లాభం కళ్లారా కనబడుతూనేఉంది. ఇంటికి సరిపడ్డ బట్టలసబ్బులు చేస్తాడు. ఇప్పుడు రవ్వంత గ్రామఫోను మెకానిజమ్ నేర్చుకుంటున్నాడు. మొన్ననే ఒక స్నేహితుడిదగ్గిరనుంచి గ్రామఫోను తెచ్చి యజమానుడి అనుమతి లేకుండా ఆయంత్రాన్ని విప్పి, రవ్వంత నేర్చుకుంటున్నాడు. అన్నీతలోకాస్తా నేర్చుకోడంలో ఉండే అభిరుచి ఏఒక్కటీ పూర్తిగా నేర్చుకోడంలో లేదు. ఉద్యోగం పనితర్వాత- ఆయన శికందరాబాదులో మహబూబ్ కాలేజీలో (నిజానికి ఇది హైస్కూలుమాత్రమే) ఉపాధ్యాయుడు. ఆపని తర్వాత నేర్చుకునేవి ఇవన్నీను. ఏదయితేనేం నా పద్యాల్ని మెచ్చుకుంటాడు. నేను ముందుముందు గొప్పకవి నౌతానంటాడు. నాకదే చాలు.

ఉట్టినే షికారుకని బయలుదేరి రైలు ఎక్కి మల్కాజాగిరిలో (మా ఊరికి రెండుమైళ్ళ పైచిల్లర దూరం ఉంది) దిగి, ఆకొండ ఈకొండ, ఆమెట్ట ఈమెట్ట ఎక్కి దిగి, హఠాత్తుగా ఒకచోట నన్ను నేను మరిచిపోయి ఆగిపోయాను. ఎంత సుందరమైన దృశ్యం! ఎంత ఆకర్షకమయినది! ఎంత మోహనమయినది! కొండమీద చిన్న ఏటవాలుప్రదేశం. ఎగువని బండరాళ్లు ఒకదానిమీద ఒకటి చక్కగా పేర్చి ఉన్నాయి. కుడిపక్కని ఈతచెట్లు ఎర్రని పళ్లగెలలతో ఊగులాడుతున్నాయి. ఎడమపక్కని మొన్న కురిసిన వానకి సెలయేటిపాయి ఒకటి దారిచేసుకుని ఇసకని చక్కని మడతలు పడజేసింది. గాలి హాయిగా వీస్తూంది. పచ్చనిపిట్ట ఒకటి పారవశ్యం పొందేటట్టు పాడుతూంది. కొంతసేపటికి నేను తెప్పరిల్లి అక్కడే రవ్వంతసేపు కూచుని, దృశ్యరసాస్వాదన మరికొంత చేసి, విడవలేక విడవలేక ఆ స్థలాన్ని విడిచి, మళ్లీమళ్లీ వెనక్కి తిరిగి చూస్తూ, చీకటిలో కనపడకపోగా కాళ్లీడ్చుకుంటూ స్టేషన్ జేరుకుని, మావూరు వచ్చేశాను. ఇంటికి వెళ్లీవెళ్లడంతోటే మా పినతండ్రికి ఆ దృశ్యంవిషయమై ఉపన్యాస మిచ్చి ఆయన్ని ఊరేటట్లు చేశాను. ఆ దృశ్యాన్ని చూడాలని ఆయన ఎంతో ఉబలాటపడ్డాడు. అంతలో "అక్కడ మనం ఫొటో తీయించుకోవాలి. దానికి సాటిదృశ్యం లేదు" అన్నాను తన్మయత్వంతో. మా పినతండ్రికూడా తప్పకుండా తీయించుకుందామని సరదాపడ్డాడు. "ఎల్లుండి శనివారంనాడే ఆ పని జరగాలి" అన్నాను కొంత ఉద్రేకం వెల్లడిచేసి, ఆయన ఒప్పుదలని ఆదుర్దాతో చూస్తూ. ఆయన తల ఆడించాడు. మరో రెండునిమిషాలు ఊరికే కూచుని లేచి, మాకు తక్కువరేటుకి చేసే ఫొటోగ్రాఫరుదగ్గిరికి వెళ్లి అన్నిసంగతులూ తెలియజేసి, ఫొటో ఏర్పాటుచేశాను.

రెండురోజుల్లో శనివారం వచ్చింది. మా ప్రయత్నానికి రెండురోజులనుంచీ అడ్డు తగులుతున్నారు, మా నాయనమ్మ (అరవై యేళ్ల వితంతువు), మాపినతల్లీను. మా పినతల్లి "అసలు ఇప్పుడు ఫొటోఎందుకు? పిల్లలజీతాలు కట్టాలి, మీ భీమాడబ్బు చెల్లించుకోవాలి,

నా నానుసీల పోయింది చేయించుకోవాలి" అని మాపింతండ్రితో అంది. పెద్దపిల్ల పెళ్లిమాట ఎత్తలేదు, ఈ కాస్తకీ పెళ్లి అడ్డిపోదనిక మోసు. మామామ్మ "నాతావళం అరిగిపోయింది. బంగారపుతీగెతో కట్టించుకోవాలి. కృష్ణమూర్తివిగ్రహానికి మురుగులు చేయించాలి" అని అంది. "ఇవన్నీ బతికున్నంతకాలం ఉండేవే" అని మా పింతండ్రి ఒక్కముక్కలో వాళ్లని నిరుత్తరుల్ని చేసేశాడు. నేను చేసినపనేమిటంటే, వాళ్ల జీవితానికి, వాళ్లజ్ఞానానికి పశువులజీవనానికి ఇసుమంతేనా తేడా లేదని ఉదాహరణలు పోగుజేసి బోలెడంత చెప్పి, మొగాళ్లకంటే వాళ్లు ఎన్నోవంతులు తక్కువని రూఢిపరిచాను. చివరికి ఫొటో తప్పిందికాదు, ఆడవాళ్లు నోరు మూసుకున్నారు.

ఫొటోకని ముస్తాబు అయాం. మాబాబయ్య షికారు బయలుదేరే దుస్తులు వేసుకున్నాడు, జరీఅంచు పెద్దాపురం పట్టుకండువా అడ్డంగా పింజపెట్టి ఒక కొసతో ముడివేసి, అది బుజాన్నివేసుకొని, చేతికర్ర పట్టుకున్నాడు. నేను పంచ సైకిలుకట్టు కట్టి, కంఠం మెడలాల్చీ తొడిగి, నావ్రటి మొహానికి గులాబీరంగు కండువా అందమని వల్లెవాటుగా వేసుకుని చేత్తో నాప ద్యాలఫైలు — అట్టమీద గిల్టురేఖలు, హంసగలది — పట్టుకున్నాను. కళ్లకి షెల్ ఫ్రేము కళ్లజోడు తగిలించాను. మా పింతల్లి తలకి నిమ్మనూనె రాసుకుని మల్లెపువ్వులు సిగలో పెట్టుకుంది. కరాచీపట్టుచీర కట్టుకుని పొరుగింటావిడివాచీగొలుసు ఎరువుతెచ్చుకుంది. కాని మాపింతండ్రి ఇష్టపడకపోవడంవల్ల ఆ గొలుసు తిరిగీ వాళ్లకి ఇచ్చేసింది. ఆమె తన ఆడపిల్లలు ముగ్గురికీ మొగలిరేకులతో జడ అల్లి మంచిగుడ్డలు కట్టింది. పెద్దకొడుకు పట్టుకండువా వేసుకున్నాడు. వాడితో నేను "ఒరే! భోజనానికి కాదురా, ఫొటోకి" అన్నాను. "నీకూ తెలిసిందీ, ఇంకేం తెలిసైనవాడివే" అన్నాడు. కొంచెంలో తప్పిపోయింది కాని నెత్తిమీద తపీమని చప్పు డవవలసిందే, నేను చెయ్యి విసరడానికి. పెద్దవాడు వేసుకున్నాడని చిన్నవాడు కూడా పట్టుగుడ్డ ధరించాడు. మా నాయనమ్మ సఫేదులాంటిసైనుగుడ్డ కట్టుకొని, తావళం ఇవతల పడేసుకుంది. దోవలోనే వనఫలహారంకూడా జరిపిద్దామని ఇంక ఉప్పుడు పిండి, జంతికెలు పట్టుకున్నాం. బండీ అవసరమనే సంగతి ఆడవాళ్లు తెలియజేశారు కాని ప్రకృతిదృశ్యాల అందాన్ని ఆస్వాదించడానికి అటువంటివి కుదరవని వాళ్లకి బోధపరిచాం. దానిమీద లేని ఓపిక, నవ్వు తెచ్చుకుని బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. మా బాబయ్య ఆఖరిపిల్లని ఎత్తుకుని గొడుగువేసుకున్నాడు. మాపిన్నమ్మ రెండోపిల్లని ఎత్తుకుంది. ఏడుస్తే ఎత్తుకుందాం రెండోవాణ్ణి అని మా మామ్మ ఊరుకుంది. మా పెద్దచెల్లెలు, దాని పెద్దతమ్ముడూ నడుస్తున్నారు.

పట్నం దాటి మల్కాజాగిరికి కాలిబాటపట్టాం. మా ఇద్దరి ఆనందం చెప్పలేనంత. "ఈ రాళ్లురప్పలదారేమిట్రా, ముళ్లుంటూ" యని మా మామ్మ విసుగ్గుంది. "నీ కేం తెలుసు చెప్పినట్టు రా" అని నేను ధామత్తు చేశాను. "మీఖర్మం, పదండి" అంది ఆవిడ.

కొంతదూరం నడిచి మా బాబయ్యతో నేను "అల్ల ఆరాయి చూడు. ఎలాగ చెక్కినట్టుందో" అని ఒక కొండవైపు చూపించాను.

"ఔను బాగుంది. దానిపక్కనే ఉన్న చెట్టు చూడు" అన్నాడు ఆయన.

"చెట్టు మరికొంచెం పెరిగుంటే ఇంకా బాగుండును" అని ఆయనభావానికి మెరుగుపెట్టాను.

"నిజమే, అది ముళ్లడొంక అయిపోయిందిగాని, మామూళ్లుచెట్టయితే ఇంకా బాగుండేది" అన్నాడాయన. ఇంతట్లో నాకాలికి ముల్లుగుచ్చుకోగా దృష్టి నేలవైపు మళ్లింది. దారిపక్కని చిన్నతీగె పచ్చనిబిళ్లపువ్వులు పూస్తూంది. "ఆహా! చూడు ఇది" అన్నాను తీగె చూపిస్తూ.

"బాగుందిరా" అని ఆయన రెండుపువ్వులు కోసి చంటిపిల్లచెవిని పెట్టాడు. పెట్టీపెట్టడంలో ఆపిల్ల వాటిని నలిపేసి కింద పారేసింది. ఆడవాళ్లు, పిల్లలూ కాస్త వెనకపడ్డారు. మా పెద్దతమ్ముడు మా ఇద్దరితో వచ్చి అడ్డప్రశ్నలు వెయ్యవలసిందేకాని వాడికి వాళ్లఅమ్మ దగ్గిర ఎక్కువచేరిక. ఆవిడ వాణ్ణి ఎప్పుడూ చదువుకో

మనదు. మాపింతండ్రి అలాగకాదు. అంచేత వాడు ఆవిడతోటే వస్తున్నాడు. అందరూ వచ్చేవరకు ఆగి "మామ్మా! ఆచెట్టు చూడు గుండ్రాయిపక్కనుంచి ఎంతచక్కగా కనపడుతూందో! ఆకులు ఎలాగ తళతళ లాడుతున్నాయో" అన్నాను. పక్కఇంటిదానిమీద నేరాలు చెప్పుగుంటూన్న ఆడవాళ్లు నావాక్యాలు తమ ధోరణ్ణిబంగం చేసినందుకు మనస్సుల్లో ఇదయారు. మా మామ్మ తలఎత్తకుండా "ఎంతో బాగుందిలే" అంది. "నీకు కనబడిందా" అని వెటకారంగా అన్నాను. "నీలాగు నన్నుకూడా కళ్లజోడు పెట్టుకో మన్నావేమిట్రా" అంది. నాలోటుకి తలతిప్పి ఊరుకున్నాను. మాపింతండ్రి మాపింతల్లితో "నీకు కనబడిందా" అన్నాడు. "అదిగో అదేనా" అంది ఆవిడ, అసలు వస్తువుతప్ప తక్కినవన్నీ చూపిస్తూ. చివరికి ఆమె కంటికి అగపడచేశాం.

మబ్బువల్ల ఎండ పట్టూ విడుపుగా ఉంది. నెత్తి మరీ మాడడంలేదు. ఇంతకీ గొడుగులు మాకు మొగాళ్లకున్నాయి. మొహం పైకి తిప్పి చూశాను. ఆకాశాన్ని అలలలాగ ఉన్న మేఘపుతునక కనబడింది. సూర్యరశ్మికి ఆగలేక కిందికి చూశాను. కింద ఎండిపోయిన సెలయేటియొక్క అలలలాంటి ఇసకపొర కనబడింది. సెలయేటిలో నీళ్లుంటే పై మేఘంయొక్క ప్రతిబింబమే ఇది అని అనుకొనేవాణ్ణి కదా! ఈ సంఘటన విచిత్రమనిపించి మా పినతండ్రికి చూపించాను. ఆయనా చూసి సంతోషించాడు. పెద్దకొండమీద నీలాకాశంలో రాంబొందులు ఎగురుతున్నాయి. ఆ దృశ్యం అత్యానందకరంగా ఉంది. మా పింతండ్రికి చూపించగా, ఆయన అక్కడే నిలబడిపోయి తన్మయత్వంతో చూసి "ఆ కొండఎక్కి నీలిపిట్ట నయిపోయి రాంబొందులతో ఆడి, ఆకాశంలోకి ఎగిరి, కలిసిపోదామని ఉంది" అన్నాడు. ఆయనవాక్కులలోని కవిత్వానికి నేను చకితుడ నయి ఆ భావం నా ఫైలులో రాసుకున్నాను, ఆయన చూడకుండా. ఇంతట్లో మా పింతండ్రి దూరాన్ని నిలుచుని పాడుతూన్న చిన్న ఎర్రనిపిట్టయొక్క అందం చూడమన్నాడు. నేను చూడకుండానే ఆ పిట్ట ఎగిరిపోగా, అది ఎగురుతూండగా ఉండే సౌందర్యం చూశాను. మరికొంతదూరంలో మూడుకొండలు లోపల ఆవరణగలిగి మూడువైపులా ఎత్తయిన గోడలలాగున్నాయి. వాటి చరియలమీద మేఘాలయొక్క నీడలు పడ్డాయి. నీడలు నడుస్తున్నాయి. పక్కన పెద్ద బండరాళ్లనీడ లున్నాయి. ఆ దృశ్యంయొక్క అందం ఇద్దరం చూసి బహు ఆనందించి, ఆడవాళ్లకి చూపిద్దామని ఆగాము. ఫర్లాంగు వెనకబడి ఉన్న ఆడవాళ్లు నెమ్మదిగా మాదగ్గరికి వచ్చారు. ఇప్పుడు వాళ్ల సంభాషణ పొరుగింటివాళ్లమీదనుంచి, మా పినతండ్రి షడ్డకుడి అప్పచెల్లెలిమీదికి మారింది. నేను పలకరించబోగా మా మామ్మ ముందరే "చూశాను" అంది. "ఏమిటే" అన్నాను నివ్వెరబోయి. ఇంతట్లో మా పింతండ్రి ఆ విషయంగురించి మా పింతల్లికి చెబుతూండడం చేత మా మామ్మ సరిగ్గానే జవాబుచెప్పి, "మేము ఇంక నడవలేమర్రా, ఎలాసహాఅవనియ్యండి" అ ం ది. వాళ్ల మొహాలు ఎండదెబ్బ తిని చెమటపట్టాయి. పిల్లల్ని ఎత్తుకోవలసివస్తూండడంచేత బొత్తిగా అలసిపోయారు. కాని "దగ్గిరికే వచ్చేశా"మని బొంకాను. ముందుకి నడక సాగించాం. ఎండధాటీవల్ల, కొంత అలసటవల్ల, సౌందర్య భావావేశంవల్ల నేను బహుసున్నితమైన మనఃస్థితిలో ఉన్నాను. ఎక్కడినుంచో ఒకసీతాకోకచిలక రెక్క ఎగిరిపడింది. పసుపుపచ్చని రంగు మధ్యని నీలిచుట్టు, లోపల నెమలిఈకరంగుతో ఉన్న ఆరెక్కని చూసి నేను మూర్ఛపోవలసిందేకాని రెక్క ఒకవైపుపగిలి ఉండడం నన్ను రక్షించింది. ఆరెక్కని మాపింతండ్రికి చూపించి "ఇక్కడ ముక్క విరిగిపోకుండా ఉంటే ఎంతో బాగుండును" అన్నాను మా పింతండ్రి ఆరెక్కనిచూసి ఆనందించాడు. పక్కనిఉన్న ఒకతీగె ఆకులు ఎండకి సోలిపోయున్నాయి. ఆమొక్కనున్న నీలిపువ్వులు మా పింతండ్రి తీసి, వేడివాసనని ఆఘ్రాణించి, ఇష్టపడక, చూడమని మా పిన్నమ్మకి ఇచ్చాడు. ఆమె ఆపువ్వులు సిగలో పెట్టుకోబోయింది. ఆమెమొహంమీద వేళ్లాడుతూన్న ముంగురులపాయి ఎంతో అంద మనిపించింది కాని ఆభావం అంతట్లోనే నాలో చచ్చింది. మా పింతండ్రిమాత్రం ఆమెవైపు ఒళ్లు మరిచి ఒక్కక్షణం చూసి, దృష్టి మరల్చుకున్నాడు. పిల్లలు "నడవలేం, ఎండగా ఉంద"ని గొడవచేస్తు

న్నారుగాని తండ్రిదగ్గిర గట్టిగా అనలేక లోపలే ఏడుస్తున్నారు. నేను చూసీచూడనట్టుగా ఊరుకున్నాను.

రెండుఫర్లాంగుల దూరంలో చిన్నతోట కనబడింది. తోటచుట్టూ పెద్దగోడ ఉంది. మే మిద్దరం వేగిరం నడిచాం. దారిలో ఒకలోయలో కనబడ్డ ఒక గోరీరాతిని మా బాబయ్యకి చూపించి "ఈ లోయ యొక్క సౌందర్యం చెడగొడుతూంది ఈరాయి" అని చెప్పి, మనస్సులో ఆరాతికి శాపనార్థాలు పెట్టాను. మా పింతండ్రి ఒప్పుకున్నాడు.

తోటలోకి వెళ్లాం. చెట్లనీడలకి, చల్లనిగాలితో కలిసిన నారింజ, నిమ్మ, దబ్బ వాసనకి, ఒళ్లు అవశమాతూంది. తోటలో మనిషిఅలికిడి ఎక్కడా లేదు. గొంతుక ఎండిపోతూండడంచేత చెట్టునున్న రెండు నారింజకాయలు పక్కనున్న గెడతో దులిపాను. దూరాన్ని చింతచెట్టుచాటునుంచి ఒక గడ్డంమనిషి రౌద్రాకారంతో దెయ్యంలాగ ఇవతలికి వచ్చాడు. వాణ్ణి దగ్గరికి రానిచ్చి శాంతపరిచేటప్పటికి తలప్రాణం తోకకొచ్చింది. కాయికి అణాచొప్పున వాడికి దాఖలుచేసి నోరు మూసుకున్నాం. వాడితో సంభాషణవల్ల తేలిన విషయ మేమిటంటే, ఆతోట ఒక నవాబుగారి దనీ, ఆయనకి ఉన్న ఆస్తిఅంతా ఈ ఎకరంతోటా, హైదరాబాదులో ఒకచిన్న సందులో ఉన్నదోసెడు పాత కొంపా అనీ, తనపెద్దకూతుళ్ల నిద్దరినీ హైదరాబాదు నిజాంగారికి మరికొంత రొక్కంతోపాటు నజరాణాగా ఇచ్చాడనీ, ఆనజరాణా ఇయ్యడంవల్ల ఈ నవాబుగారి కుటుంబం రాత్రిపూటమాత్రమే జొన్న అన్నం తింటున్నారనీ, ఆయన దగ్గిర నిలుచుని తోటలోని చెట్లకాయలు కోయిస్తాడనీ, అటుతర్వాత చెట్టుమీదేనా చెయ్యివెయ్యకూడదనీను. బట్ట, బువ్వలేని నవాబుగారి గ్రహాలు ప్రస్తుతం మంచిఇళ్లలోనే ఉన్నట్టుగా నాబుద్ధికి తోచింది. ఎంచేతంటే ఇద్దరిపిల్లల్ని గాక వట్టిరొక్కమే నజరాణాగా చెల్లించి ఉంటే నవాబుగారు రెండు రోజుల కొకపూట భోంచెయ్యవలసి వచ్చేది. అలాగగాక ఇప్పుడు రోజుకి ఒక్కమాటేనా కూడు కళ్లతో చూస్తున్నాడు. ఇంతట్లో మావాళ్లు మమ్మల్ని కలుసుకున్నారు. తోటలోని నూతిదగ్గిర కూచుని ఫలహారం చేద్దామని వాళ్లదగ్గిర మూట తీసుకొని విప్పగా, ఆవకాయిముక్కలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఉప్పుడుపిండి, జంతికలు పిల్లలు దారిలోనే భక్షించేశారు. చేసేదిలేక మే మిద్దరం చెరోనాలుగుముక్కలు తిని-మా పింతల్లిమాట జ్ఞాపకంలేదు - ఇన్నినీళ్లు తాగి, కొంతబడలిక తీర్చుకున్నాం. ఈ ఫలహారంకంటె ముందు ఇద్దరం చెరోనారింజకాయ - మాపింతండ్రి మూడోవంతుకాయ చంటిపిల్లకి పెట్టాడు – తినడం కొంత నిజమైన సత్తువ ఇవ్వడంచేత మళ్లా ప్రయాణం సాగించాం. మానాయనమ్మ తిట్లు ప్రారంభించింది, మమ్మల్నికాదు ఫొటోని. ఇంకెంతదూరమని ఆవిడకి ధైర్యంచెప్పి బయలుదేరాం. ఎండ తగ్గింది, దానితో ఎండదెబ్బ తగ్గింది. అలసట వృద్ధిపొందినా సంతోషమే ఓపికగా నడిచాం. నేను అనుకున్నస్థలం చూపుమేర దూరంలో ఉంది. అక్కడ ఫొటోగ్రాఫరు, పక్కన కూలివాడు సిద్ధంగాఉన్నారు. గమ్యస్థానం సమీపించినందుకు అంతా పరమసంతోషం పొందాం. ఆస్థలంచేరాం. ఆడవాళ్లు నేలనిచతికిలపడ్డారు. పిల్లలు నేలమీద పడుక్కున్నారు. "ఎండతగ్గిపోతూంది, ఆలస్యంచెయ్యడానికి వీలులేదు, అంతా అమర్చుకు కూచున్నాం" అని ఫొటోగ్రాఫరు కూలివాడు తొందరచేశారు. వాళ్లు ఇద్దరూ పువ్వులరంగళ్లలా ఉన్నారు. ఫొటోగ్రాఫరు క్రాపింగులో ఒక్కవెంట్రుకేనా చెదరలేదు. రైలుమీద వచ్చాడు ఆయనగారు. మా పింతండ్రి ప్రకృతిదృశ్యాన్నిచూసి బహు రమణీయమైనదనిచెప్పి, అక్కడ ఫొటోతీయించుకోడం మన అదృష్టమని మెచ్చుకొని, అలసిపోవడంచేత తలవంచుకు కూచున్నాడు. నేను గొడుగుమీద ఆనుకుని కళ్లలో లేనిజీవం తెచ్చుకుని దృశ్యంవైపు చూసి ఆనందం పొందుతున్నాను. వెలుతురు తగ్గిపోతూందని ఫొటోగ్రాఫరు గొడవచెయ్యడంచేత అంతాలేచి ఫొటోకి సిద్ధమయాం. నేనూ, మా పింతండ్రీ నిలుచున్నాం. మా పింతండ్రి చేతిలో పిల్ల ఉంది, చేతికర్ర కిందపడేశాడు. మామధ్యని మా పెద్దచెల్లెలు, పెద్దతమ్ముడు నిలుచున్నారు. మా పింతండ్రికి ముందువైపు మాపింతల్లి రెండోపిల్లని తన ముందు పెట్టుకునికూచుంది. నాకు ముందువైపు మామామ్మ రెండోమనమణ్ణి తన ముం దుంచుకుని కూచుంది. మరొక్కనిమిషంలో ఫొటో తియ్యడ మయిపోయింది.

యాత్ర పూర్తి అయినందుకు సంతోషించి, బయలుదేరి స్టేషన్ చేరుకుని, బొలారం పాసింజరుమీద అరఘడియలో ఇంటికి వచ్చేశాం.

నేను చాలా తొందరపడ్డాను, వీలైతే ఆరాత్రే ప్రూఫ్ చూద్దామని. కాని కుదరలేదు. ఆ మర్నాటి సాయంత్రానికి ఫొటోలే వచ్చేశాయి. ఫొటోని చూసి నిశ్చేష్టు లయాం. నేను నేనులాగ లేను. మహాకవిలాగ ఆకాశంవైపు ప్రశాంతంగా చూస్తూ నిలబడి ఫొటోలో పడదామని అనుకున్నాను. కాని - కాని ఫొటోలో మార్గాయాసమంతా నా మొహాన్నే ఉంది. మొహం ముడతలుపడిపోయి కనుబొమ్మలు ముందుకి వచ్చి కళ్లు చిన్నవయి, అడుగు పెదిమి పైకివెళ్లి ఏడుపుకి సిద్ధమయినట్లుగా పడ్డాను. కాళ్లూచేతులూ జవంలేక తోటకూరకాడల్లాగ వేళ్లాడుతున్నాయి. గొడుగుమీద భారంవేసి నిలుచున్నాను. వల్లెవాటువేసుకున్న కండువా అలుగ్గుడ్డరంగున పడింది. మాపింతండ్రో! ఆయన మొహం అతిచిరాకుగా ఉంది. లేనిపోని ముడతలన్నీ చొక్కాని, కండువాని పడి అసహ్యంగా ఉంది. మా పింతండ్రిచేతిలో పిల్లనీ రెండవైపు తిన్నగా చూడలేక మొహం వెనక్కి తిప్పేసింది. అంచేత మొగలిరేకుతో పిలకమాత్రం పడింది. మామధ్యనున్న పెద్దవాడి చొక్కాబొత్తాలు ఊడిపోయాయి. పైగా, వాడు నాలాల్చీ జేబులోది దొంగతనం చెయ్యబోతూన్నట్టుగా పడ్డాడు. మా పెద్దచెల్లెలు నోరుతెరిచి పళ్లు బైటపడేసి దేభ్యంలాగ పడింది. తలవెంట్రుకలు రేగిపోయి తల పిచికలగూడులా గుంది. మాపింతల్లి జుట్టు రేగిపోయింది, కళ్లు కిందికి వాల్చి అశోకంకింది సీతాఅమ్మవారులాగ కూచుంది. ఆమె ముంగున్న పిల్ల చింపిరితలతో ఓరగా చూస్తూ, రాళ్లేరుతూంది. మానాయనమ్మ మొహం ముడుచుకుపోయింది. నోట్లో వేసుకున్న చెక్కపలుకు మునిపళ్లతో నొక్కుతూ కోతిలాగు పడింది. ఆమెముందున్న కుర్రాడిబుజాలమీద ఆమెచేతులు వెయ్యడంచేత ఏదో కాస్త తిన్నగా కూచున్నవాడు రాంబొందులాగ పడ్డాడు. నానాకంగాళీగాను ఉన్న ఈఫొటోలో మా వెనకనున్న ప్రకృతిదృశ్యం, నాపక్కని తియ్యడం మరిచిపోయి పెట్టినఫలహారపు బుట్టమూట, నాచేతిలో గొడుగు బాగా పడ్డాయి. ఈఫొటోని చూసి పెద్దవాళ్లం అసహ్యించుకున్నాంగాని పిల్లలు తమలో తాము అందరికంటే నేను బాగాపడ్డానంటే నేను బాగాపడ్డానని గద్దులాడుకున్నారు.